అక్రమ నిర్మాణాల కూల్చివేత



కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు

అబిడ్స్: జీహెచ్ఎంసీ అబిడ్స్–14 సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపడుతున్నారు. ఇటీవల బేగంబజార్, ఫీల్‌ఖానా ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు మంగళవారం నియాజ్‌ఖానా ప్రాంతంలో మరో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్ బాబు, సెక్షన్ అధికారి మహేందర్ మాట్లాడుతూ..ప్రజల ఫిర్యాదుల మేరకు అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి ఆ భవనాలను సీజ్ చేయడంతో పాటు కూల్చివేస్తామన్నారు.

వైభవంగా దసరా సమ్మేళనం



గౌలిపురా: హనుమాన్‌నగర్‌లోని ధన్‌రాజ్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ నవశక్తి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దసరా సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణ్, పుల్లయ్య, ఆర్.అన్నయ్య, లక్ష్మయ్య, జె.లక్ష్మణ్ గౌడ్, కె.గోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న మాణిక్ ప్రభు, ముక్క కృష్ణాగుప్తా

అబిడ్స్/గోల్కొండ: గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని తెలంగాణ బీజేపీ కిసాన్‌మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు రావుల మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణాగుప్తా డిమాండ్ చేశారు. మంగళవారం లక్డీకాపూల్‌లోని కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ డిప్యూటీ కలెక్టర్ వెంకటాచారికి మెమోరాండం అందజేశారు. అనంతరం మాణిక్ ప్రభు, ముక్కా కృష్ణాగుప్తా మాట్లాడుతూ..22 నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను దగా చేసిందన్నారు. ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు వరంగల్‌లో రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ డిక్లర్ చేసిన మ్యానిఫెస్టో ప్రకారం వెంటనే రైతుల హామీలు నెరవేర్చాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

చినజీయర్ స్వామికి ఆహ్వానం



చార్మినార్: రాబోయే దీపావళి వేడుకల సందర్భంగా అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరుతూ చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ శశికళ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజా చిన జీయర్ స్వామికి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ నెల 20న దీపావళి వేడుకలను ఆలయంలో వైభవంగా నిర్వహించనున్నామని..ఈ పూజల్లో పాల్గొనాలని ఆయనను ఆశ్రమంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేసి కోరినట్లు ఆమె తెలిపారు.

టోలిచౌకీలో విద్యుత్ శాఖ అధికారుల పర్యటన



గోల్కొండ: విద్యుత్ సమస్యలను వెంటవెంటనే పరిష్కరిస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ ఎన్.నర్సింహులు అన్నారు. మంగళవారం ఆయన టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులతో కలిసి మెహిదీపట్నం డివిజన్ షేక్‌పేట్ విద్యుత్ సెక్షన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఏ కాలనీ, మారుతీనగర్, టోలిచౌకీ పరిసర కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు తదితర వాటిపై వచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగా వాటిని పరిశీలించారు. ఆయన వెంట సీఈ ప్రభాకర్‌రావు, మెహిదీపట్నం డివిజన్ డీఈ సుధీర్, ఏఈడీ మాధవరావు, సెక్షన్ ఏఈ ఎండీ జాఫర్ తదితరులున్నారు.



మేకలమండి రహదారిలో చెత్తాచెదారం



జియాగూడ మండి గేటు వద్ద బురద

మేకలమండి..చెత్తతో నిండి

- కంపు కొడుతున్న జియాగూడ మేకల మండి పరిసరాలు
- పేరుకుపోతున్న వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు

జియాగూడ: జియాగూడ మేకలమండికి ప్రతిరోజూ వేలాది గొర్రెలు, మేకలు విక్రయానికి వస్తుంటాయి. వాటితో పాటు లారీలలో గడ్డి, చనిపోయిన గొర్రెలు, మేకలు వస్తుంటాయి. వాటిని అక్కడే వదిలేసి లారీల వారు వెళ్లిపోతుంటారు. సకాలంలో జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించాలి కానీ రోజులు గడుస్తున్నా వాటిని తొలగించరు. దీంతో జాతీయ రహదారిలో దుర్వాసనలు వీస్తున్నాయి. రహదారులలో ఒకదారి పూర్తిగా మేకలమండిలో కలిసిపోతుంది. చెత్తాచెదారం, గడ్డి, మృతిచెందిన గొర్రెలు, మేకలు, గుట్టలుగా పేరుకుపోవడంతో రహదారి పూర్తిగా మూసుకుపోయింది.

మండిలో అదే పరిస్థితి..

మండిలో ఎప్పుడు బురద, చెత్త, గడ్డి ఎక్కడ పడితే అక్కడ ఉంటుంది. మండికి కొనుగోలు చేయడానికి వచ్చే వినియోగదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండిలో కనీసం సరైన పార్కింగ్ లేకపోవడం వల్ల వాహనాలను ఇరుదిక్కుల గేట్‌ల బయటే పార్క్ చేసి వస్తున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది.



100 ఫీట్ రోడ్డులో మృతిచెంది ఉన్న మేక

బల్దియా కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే కౌసర్



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: భారీ వర్షాలకు కార్వాన్ నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన బల్దియా కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన భారీ వర్షాల వల్ల కార్వాన్‌లో తలెత్తిన పరిస్థితులను ఆయనకు వివరించారు. కార్వాన్ మెయిన్ రోడ్డు, లంగర్‌హౌస్, టోలిచౌకీ చౌరస్తా, నానల్‌నగర్ చౌరస్తాతో పాటు టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలోని కాలనీల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. ప్రస్తుతం ఉన్న మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు సహాయక చర్యలకు సరిపోవడం లేదన్నారు. ప్రతి డివిజన్‌లకు అదనపు మాన్‌సూన్ టీమ్‌లను వెంటనే పంపాలని ఆయన కోరారు. పారిశుద్ధ్య పనుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



జగదీశ్వర్, ముజీబ్ హుస్సేన్‌ను సత్కరిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. టీఎన్జీఓస్ యూనియన్ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి భాస్కర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, శ్రీహరి, ముఖైర్ అహ్మద్, ప్రియాదేవ్, శ్రీధర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలి



లంగర్‌హౌస్: మహిళలు బాలికలు పౌష్టికాహారంపై అవగాహనతో పాటు సామాజిక దురాచారాలు, వేధింపులు వంటి సమస్యలపై చైతన్యం కలిగి ఉండాలని మహిళా కమిషనర్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసం పురస్కరించుకొని ఐసీడీఎస్ గోల్కొండ ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేరెళ్ల శారద, మహిళా కమిషనర్ కార్యదర్శి పద్మజ రమణ మాట్లాడుతూ..పోషకాహారం తీసుకోవడం వల్లనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. మహిళలు, బాలికలపై సమాజంలో వివిధ రకాలుగా వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వాటిని ధైర్యంగా ఎదుర్కోవడానికి పూర్తిగా చైతన్యం కలిగి ఉండాలన్నారు. అనంతరం బతుకమ్మను చేసి ఆడిపాడారు. ఇందులో భాగంగా పౌష్టిక ఆహార పదార్థాల ప్రదర్శన, పోషక ఆహారం పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయేష, రేణుక, భరత్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి మణికంఠ మహా పాదయాత్ర

గౌలిపురా: ఈ నెల 11 నుంచి 17వ వరకు మణికంఠ మహా పాదయాత్రను నిర్వహించనున్నట్లు మణికంఠ మహా పాదయాత్ర భక్త బృందం ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 11న ఉదయం 9.30 గంటలకు గౌలిపురా శ్రీరాంనగర్‌లోని అయ్యప్ప ఆలయం నుంచి ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు.

మెరిట్ లిస్టు విడుదల చేయాలి



గోపీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును విడుదల చేయాలని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు జాలిగామ అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్ గోపీకాంత్ రెడ్డిని కలిసి సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..732 ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టుల మెరిట్ లిస్ట్‌లను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ లిస్టులపై కోర్టు నుంచి ఎలాంటి స్టే ఇవ్వలేదు కాబటి వెంటనే రిజల్ట్ ప్రకటించాలని చైర్మన్‌తో చర్చలు జరిపామని తెలిపారు. డ్రగ్స్ కంట్రోల్ పూర్తి నివేదిక రాగానే ఆయా సమాచారం ప్రభుత్వం పంపించి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని కోర్టుకు సమర్పించి రిజల్ట్ ప్రకటిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారని వారు తెలిపారు.

శ్రీకాంత్‌భరత్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న ఇరుకుల రామకృష్ణ

అబిడ్స్: మహాత్మాగాంధీపై అసభ్యకర అనుచిత వ్యాఖ్యలు చేసిన టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ భరత్‌ను వెంటనే అరెస్టు చేయాలని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ మాట్లాడుతూ..ప్రపంచమంతా శాంతి దూతగా పిలుచుకునే మహాత్మాగాంధీ గురించి వివిధ సామాజిక మాధ్యమాల్లో శ్రీకాంత్ భరత్ చేసిన వ్యాఖ్యలను తొలగించాలని, అతనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న తమ క్లబ్ ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వినతిపత్రం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గార్లపాటి శ్రీనివాస్ సర్వీస్ సెక్రటరీ బోడా ప్రకాష్, కోశాధికారి సుజాత, రమేష్ యాదవ్, నాగేశ్వరరావు, రేణికుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత, నృత్య డిప్లొమా కోర్సుల ఫలితాలు విడుదల

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న 14 ప్రభుత్వ, సంగీత, నృత్య పాఠశాలలు, కళాశాలల్లో జూన్ 2025న నిర్వహించిన డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల వార్షిక పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ సమావేశంలో ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలను తెలుగు వర్సిటీ వెబ్‌సైట్‌లో వీక్షించవచ్చని పరీక్షల నియంత్రణాధికారిణి ఎం.వి.ఆదిలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు.

నాంపల్లిలో గంజాయి పట్టివేత

నాంపల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎస్‌టీఎఫ్ఏ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎస్‌టీఎఫ్ఏ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..నాంపల్లి మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి చేరుకుని గంజాయిని విక్రయిస్తున్న హటగోడ సంజయ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటుగా ఒక ద్విచక్రవాహనాన్ని, ఒక సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న శేఖర్ బాబు, కామ్రే బాబు, గంగోలి బహు అనే ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురు పరారీలో ఉన్నట్లు అంజిరెడ్డి తెలిపారు. నిందితుడిని నాంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

పెచ్చులూడిన మచిలీకమాన్.. ఒకరికి గాయం



బాధితుడిని పరామర్శిస్తున్న చార్మినార్ ఎమ్మెల్యే

చార్మినార్: చార్మినార్‌కు సమీపంలోని మచిలీకమాన్ పై భాగంలోని సిమెంట్ పెచ్చులూడి కింద పడడంతో అక్కడే క్రాకరి దుకాణంలో పని చేసే వ్యక్తికి స్వల్ప గాయమైంది. ఎక్కువగా జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ప్రమాదావశాత్తు జరిగిన ఈ ఘటనతో స్థానిక చిరువ్యాపారులు, పాదచారులు, వాహనదారులు ఖంగు తిన్నారు. విషయం తెలిసిన వెంటనే చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని పరామర్శించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించి వెంటనే మరమ్మతు పనులు చేసి బాధితుడికి మెరుగైన చికిత్సలు అందించే ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

9న 'సెయింట్ ఆన్స్'లో రతన్ టాటా వర్ధంతి

అఫ్జల్‌గంజ్: పారిశ్రామిక వేత్త, పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత రతన్ టాటా వర్ధంతిని ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. మెహిదీపట్నం సెయింట్ ఆన్స కళాశాలలో గురువారం ఉదయం 11 గంటలకు రతన్ నావెల్ టాటా లెసెన్స్ ఫ్రం ఏ లైఫ్ ఆఫ్ ఇంటిగ్రిటీ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నగరంలోని పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో సిటిజన్ కౌన్సిల్ గౌరవ అధ్యక్షులు బండారు దయానంద్, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ విజయరాణి, కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ మహిత దావ పాల్గొని ప్రసంగిస్తారని ఆయన వెల్లడించారు.

చౌమహల్లా ప్యాలెస్‌లో 8వ నిజాం ముకర్రం ఝా ఎగ్జిబిషన్



ప్రత్యేక ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

చార్మినార్: 8వ అసఫ్ జా, మాజీ హైదరాబాద్ నిజాం ముకర్రం ఝా బహదూర్ జయంతిని పురస్కరించుకుని చౌమహల్లా ప్యాలెస్‌లో మంగళవారం నుంచి అరుదైన ఛాయా చిత్రాల ప్రదర్శన సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. సోమవారం ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన కుమారుడైన 9వ నిజాం అజ్మత్ ఝా బహదూర్ ప్రారంభించారు. ఈ ఫొటో ఎగ్జిబిషన్‌లో ముకర్రం ఝా బహదూర్ చిన్ననాటి (బాల్యం) నుంచి జీవితాంతం వరకు జరిగిన పరిణామాలు, ఇతర అంశాలు, అతను వాడిన వస్తువుల చిత్రాలతో కూడిన ప్రదర్శన ఏర్పాటైంది. ఇందులో దాదాపు 250కి పైగా చిత్రాలను పొందుపరిచినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 7వ అసఫ్ జా నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ తన మనవడైన ముకర్రం ఝా బహదూర్ ను 8వ అసఫ్ ఝాగా ఎంచుకున్నారు. 1967లో ఆయన అధికారం చేపట్టారు. ముకర్రం జా బహదూర్ 2023లో జనవరి 14న ఇస్తాంబుల్‌లో కన్నుమూశారు. ప్రస్తుతం అసఫ్ జాహీల రాచరిక పాలనకు అద్దంపట్టే విధంగా ఉన్న చౌమహల్లా ప్యాలెస్‌లో ఆయన ఛాయా చిత్రప్రదర్శన మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చింది.

మిధానిలో ఉత్పత్తి, మార్కెటింగ్ డైరెక్టర్‌గా పదవిట్టన్ బాబు



బాధ్యతలు చేపడుతున్న పదవిట్టన్ బాబు

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లో ఉత్పత్తి, మార్కెటింగ్ డైరెక్టర్‌గా పదవిట్టన్ బాబు నియమితులయ్యారు. మంగళవారం ఆయన పదవీ బాధ్యతలను చేపట్టారు. పదవిట్టన్ బాబు ఒక మెటలర్జికల్ ఇంజినీర్‌గా ప్రత్యేక స్టీల్స్, సూపర్ అల్లాయ్స్, టైటానియం, మిశ్రమలోహాలు వంటి ప్రత్యేక లోహాలు, మిశ్రమ లోహాల రంగంలో మూడు దశాబ్దాలకు పైగా విశేష అనుభవం కలిగి ఉన్నారు. మార్కెటింగ్ రంగంలో ఆయన కొత్త మార్కెట్లను అభివృద్ధి చేయడంలో, ఎగుమతులను పునరుద్ధరించడంలో కస్టమర్ నిశ్చితార్థాన్ని బలోపేతం చేయడంలో, ఏరోస్పేస్, రక్షణ, శక్తి, పారిశ్రామిక అనువర్తనాలు వంటి కీలక రంగాల్లో ప్రముఖ కస్టమర్లతో దీర్ఘకాలిక సంబంధాలను నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు.

ఆర్టీసీ చార్జీలు తగ్గించాలని నిరసన



ఫారూఖ్‌నగర్ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

చాంద్రాయణగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం చాంద్రాయణగుట్ట కార్యదర్శి ఎస్.కిషన్ డిమాండ్ చేశారు. బస్సు చార్జీల పెంపును నిరసిస్తూ ఫారూఖ్‌నగర్ డిపో ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ..ఆర్టీసీ నష్టాల్లో ఉందన్న నెపంతో ప్రయాణికులపై అధిక భారం మోపడం సరైంది కాదన్నారు. ఎన్నికలకు ముందు ఉచిత బస్సు ప్రయాణ విషయమై ఆలోచించుకునే హామీ ఇవ్వాల్సిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, బాలు, పాషా, గౌస్, యాదయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ శాశ్వత ఉద్యోగులకు ప్రత్యేక కాలనీ



మాట్లాడుతున్న ఊదారి గోపాల్

సుల్తాన్‌బజార్: జీహెచ్ఎంసీలో విధులు నిర్వహిస్తున్న శాశ్వత ఉద్యోగుల కోసం ప్రత్యేక కాలనీని ఏర్పాటు చేస్తున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నగర శివారులోని కొల్లూరులో 220 ఎకరాల స్థలంలో ఈ కాలనీని నిర్మించనున్నట్లు వివరించారు. ఈ కాలనీలో గజం ధర రూ.3,999 వేలుగా నిర్ణయించడమైందని, జీహెచ్ఎంసీ శాశ్వత ఉద్యోగులు కేవలం రూ.1 చెల్లించి సభ్యత్వం తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం స్థలానికి డీటీసీపీ అనుమతులు పొందే ప్రక్రియలో ఉన్నట్లు ఆయన తెలిపారు. స్థలాన్ని ప్రత్యేక్షంగా చూపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఇతర శాఖల ఉద్యోగులకు ఇప్పటికే కాలనీలు ఉన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఉద్యోగుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటుతో సొంత ఇంటి సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు.

'సాహిత్యం, సంగీతం మనసుపై వేసిన ముద్రలు చెరిగిపోవు'



వాసురావుకు పురస్కారాన్ని అందజేస్తున్న డాక్టర్ వరప్రసాద్ రెడ్డి

గన్‌ఫౌండ్రీ: మంచి సాహిత్యం, సంగీతం మనసుపై వేసిన ముద్రలు చెరిగిపోవని పద్మభూషణ్ పురస్కార గ్రహీత, డాక్టర్ కె.ఐ.వరప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ల సంయుక్తాధ్వర్యంలో పద్మ విభూషణ్ ఎస్పీ బాలసుబ్రమణ్యం పంచమ వర్ధంతిని పురస్కరించుకొని సంగీత దర్శకుడు ఎస్.వాసురావుకు కిన్నెర–బాలు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాహిత్యం, సంగీతం ముద్రలు మరిచిపోలేమని అందువల్లనే నేటికీ ఘంటసాల, సాలూరి రాజేశ్వర్‌రావు, ఎస్పీ బాలసుబ్రమణ్యం వంటి వారిని స్మరిస్తున్నామని తెలియజేశారు. వాల్మీకి రామాయణం, వ్యాస మహాభారతం, రామదాసు అన్నమయ్య వంటి వ్యక్తుల కీర్తనలు నిలిచి ఉండడానికి, వాసురావు రూపొందించిన శ్రీరామ కథామృతం మంచి ప్రయత్నమని ప్రశంసించారు. వాయిద్య సంగీత సీడీని రూపకల్పన చేయాలని కోరారు. అంతకు ముందు ప్రముఖ గాయకుడు రామాచారి శిష్య బృందం పాడిన పాటలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సినీ జర్నలిస్టు ఎస్వీ రామారావు, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



జియాగూడ: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని కుల్సుంపురా ఏసీపీ మునావర్ అన్నారు. మంగళవారం కుల్సుంపురా పోలీస్ స్టేషన్‌లో కుల్సుంపురా, టప్పాచబుత్ర గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుమారు 60 మంది రౌడీషీటర్‌లకు కుల్సుంపురా డీఐ నాగార్జున ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..రౌడీషీటర్‌లు ఎలాంటి నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై ఉన్న రౌడీషీట్‌లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ అభిలాష్, గుడిమల్కాపూర్, ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్ఐ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తినీయం



శ్రీకాంత్‌గౌడ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తినిస్తుందని రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..బోయ కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ..కృషి ఉంటే మనుషులు రుషులవుతారు, మహా పురుషులవుతారు అన్న మాటలకు వాల్మీకి మహర్షి జీవితం ఒక ప్రత్యక్ష నిదర్శనమని కొనియాడారు. అంతకు ముందు కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ మహ్మద్ ఉబేదుల్లా కొత్వాల్, ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ తిరుమలేష్ నాయుడు, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో..

అబిడ్స్: వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్, సీనియర్ అసిస్టెంట్, సోషల్ వర్కర్ కిషన్ సింగ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాహుల్, గీతా, లత తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్, కిషన్‌సింగ్